
బాంబే ఎక్స్‌ప్రెస్‌లో జనం కిటకిటలాడిపోతున్నారు. సెకెండు క్లాసు కంపార్టుమెంటులో నిలబడటానికి కూడా స్థలం లేదు. అయినా అలాగే నిల్చునున్నాడు శంభూ. ఈ రైలు సాయంత్రానికి కాని తమ ఊరు చేరదు. అందాకా తనిలా నిలబడి ఉండాల్సిందేనని అనుకున్నాడు శంభూ.

శంభూ తన ఊరొదిలి అప్పుడే ఆరేళ్ళయింది. అయినా నిన్నగాక మొన్నే జరిగినట్టుంటుందంతా! అప్పుడొదిలిన వూరికి మళ్ళీ ఇప్పుడే పోవటం. ఊళ్ళో తన అమ్మా - నాన్నలున్నారు. తాతలనాటి ఇల్లొకటుంది. కొంత పొలముంది. తన లక్ష్మి వుంది.

తనాఇంట్లోంచి మెట్రిక్ చదివేప్పుడు వెళ్ళిపోయాడు. తనకిప్పటికీ జ్ఞాపకం. ఓ రోజు సాయంత్రం తను ఇంట్లోకి అడుగుపెడుతూనే నాన్న అరుపులు వినిపించాయి. అమ్మ ఏడుస్తోంది. తాగిన మైకంలో నాన్న అమ్మను కొడుతున్నాడు. అమ్మేమో నాన్నను తిడుతోంది. ఆ యింట్లో రోజూ జరిగే రభసే ఇది.

ఆ రోజెందుకోగాని నాన్న అలా అమ్మను కొడుతుంటే తను చూస్తూ ఊరుకుండ లేకపోయాడు.

గభాల్న ముందుకెళ్ళి నాన్నను ఇవతలకు లాగబొయ్యాడు. అంతే మొదటే కోపంగా ఉన్న నాన్న మరీ రెచ్చిపోయాడు. గట్టిగ్గా అరుస్తూ తననూ నాలుగు తగిలించాడు.





ఒకావిడ టెలిఫోన్‌లో మాట్లాడుతోంది.
"ఏమండీ. మా ఆయనను పిలవండి!"
"నెంబర్ ఎంత?" అటువైపు ప్రశ్నించాడు ఆపరేటర్.
"నెంబర్ ఎంత అని అడుగుతమేమిటి? నాకున్నది ఒక్కడే మొగడు" కోపంగా అంది ఆవిడ.
సావిత్రి- హైదరాబాద్

నిష్కారణంగా నాన్న తననిలా తన్నేసరికి శంభూకి ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. కోపంతో పాటు రోషమూ వచ్చింది. రోజుకో నరకంలా ఉండే ఈ ఇంట్లో ఇహతనుండగూడదనుకున్నాడు. పరీక్ష ఫీజుకని తన దగ్గరున్న డబ్బుని తీసుకున్నాడు. క్లాసు పుస్తకాల్ని పాత పుస్తకాల షాపులో అమ్మేడు. రైలుస్టేషన్ చేరుకుని కదల బోతున్న రైలెక్కాడు. బొంబాయిలో దిగాడు. దిగాడే గాని అక్కడ తను బతికేదేలా? ఈ మహానగరంలో తననడిగే వారెవరు? బతుకంటే ఏమిటో అప్పుడే తెలిసొచ్చిందతనికి.

పని కోసం ప్రయత్నించాడు. దొరకలా, తిండి కోసం తిరిగాడు. అదీ దొరకలా. ఇక తనేంచేయగలడూ? పస్తులున్నాడు. కుళాయి నీళ్ళు తాగాడు. ఫుట్‌పాత్ మీద పడుకున్నాడు. జీవితం దుర్భరమనిపించింది. చివరకు మనస్సు చిక్కబట్టుకుని ధైర్యం తెచ్చుకున్నాడు. ఆత్మస్థయిర్యం పెంచుకున్నాడు. టీ బడ్డీలో కప్పులు కడిగాడు. అల్పాహారాల్ని అందించాడు. మార్కెట్ స్థలాల్లో మూటలు మోశాడు. తోపుడు బళ్ళలో సరుకులు చేరవేశాడు. బూట్లు పాలిష్ చేశాడు. న్యూస్‌పేపర్లమ్మాడు. ఒకటేమిటి ఏ పని దొరికితే ఆ పని చేశాడు. అందుకే ఇప్పుడు శంభూకు రానిపనంటూ లేదు. తెలియని విషయమంటూ లేదు. ఇంతకీ అతనుండేదొక మురికివాడలో. కనీస వసతులు కూడా లేని ఒక నరకంలో.

బొంబాయిలాంటి మహానగరంలో మాసిన గుడ్డలకు విలువలేదని మంచి బట్టల్లోకి మారాడు శంభూ. అలగా జనంతో తిరిగి లాభం లేదని చదువుకున్న వారితోనే తిరగడం ప్రారంభించాడు. నాగరికంగా మాట్లాడటం నేర్చుకున్నాడు. వీధి దీపాల కింద కూర్చుని పాత పుస్తకాల పుటల్ని తిరగేశాడు. ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. ఎంతో విజ్ఞానాన్ని సంపాదించాడు. ఈ ప్రపంచమెంత విశాలమైందో అప్పుడర్థమయిందతనికి. జీవితమెంత క్లిష్టమయిందో తెలిసొచ్చింది. రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. పైసాపైసా కూడబెట్టాడు. నెలకింత అమ్మా నాన్నలకి పంపుతూ వచ్చాడు. లక్ష్మి చదువుకుంటోందని తెలిసి ఆమెకు డబ్బు పంపుతూ వచ్చాడు. తెలిసిన వాళ్లు కలిసినప్పుడు ఆమెకు కావలసిన పుస్తకాలు కొని పంపించాడు. ఇంకా పై చదువులు చదివినా చదివించాలనుకున్నాడు. చిన్నప్పుడామెకు మొట్టికాయలు మొట్టి ఓనమాలు నేర్పింది తనే మరి!

కాలం గడుస్తోంది. వయస్సు పైబడుతోంది. యవ్వనం కరుస్తోంది. జీవితంలో తనెప్పుడో ఒకప్పుడు స్థిరపడాలి. అదిప్పుడే ఎందుకు కాకూడదు? అని ఆలోచించాడు శంభూ. ఆరేళ్ల క్రితం తనీ బొంబాయి వచ్చాడు. కష్టపడ్డాడు. ఇంతో అంతో సంపాదించాడు. ఇప్పుడు తన దగ్గర పదివేల పైనే ఉంది. ఈ డబ్బుతో తను తన ఊరెళ్లి అక్కడ స్థిరపడొచ్చు. ఈ మురికివాడల్లో పడి నరకం అనుభవించేకన్నా సొంత ఊళ్లో నాన్నతో పొలం దున్నుకుని కాలం గడపొచ్చు. లక్ష్మిని పెళ్లి చేసుకుని సుఖజీవనం సాగించవచ్చు. అయినా లక్ష్మి తను రాసే ప్రతి ఉత్తరంలోనూ తమ పెళ్లి గురించే రాస్తోంది. ఆమె తనకోసం ఎదురు చూస్తోంది. పాపం ఇంకెంతకాలం ఆగుతుంది? అందుకే తమ పెళ్లి జరిగిపోవాలి అని అనుకున్న శంభూ మరో ఆలోచన కూడా చేశాడు. తను శాశ్వతంగా మకాం మార్చేముందు తమ ఊరొకసారి వెళ్లి అక్కడి పరిస్థితులేమిటో తెలుసుకుని రావాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా బయలుదేరాడు.

ఎక్కిన తర్వాత గాని అర్థం కాలేదతనికి ఆ రైలు ఎంత రద్దీగా ఉండేదీ! ఇలా నుల్చునే ప్రయాణం చేస్తున్నాడు. ఆ జనంలో నలిగిపోతూనే లక్ష్మి గురించి ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు పెద్దదైపోయుంటుంది లక్ష్మి. అంతెత్తున ఎదిగుంటుంది. ఆకస్మాత్తుగా తననిప్పుడు చూసి ఆశ్చర్యపోతుంది. సిగ్గుపడుతుంది. కిలకిలా నవ్వుతుంది. ఇలా ఆలోచిస్తున్న శంభూకి నిజంగానే ఎవరిదో నవ్వు వినిపించింది. ఎవరాని చూస్తే పక్క బెంచీమీదున్న ఓ యువజంట సరసాలాడుకుంటున్నారు.

వీళ్ల ప్రపంచంలో వీళ్లుంటే, వీళ్ల పక్కనే కూచున్న పెద్దాయన వీళ్ల ఎయిర్ బ్యాగ్‌లోంచి కొన్ని వస్తువులు తీసి తన బ్యాగ్‌లో వేసుకుని మళ్లీ బుద్ధిగా తనిందాకా చదువుతున్న నవల్లో లీనమయ్యాడు. ఇది చూసిన శంభూకి ఆశ్చర్యమేసింది. పెద్దమనుషుల్లోనూ దొంగలుంటారా? అని ఈయన్నెలాగైనా పట్టించాలని అతను అనుకుంటుండగానే రైలు వేగం తగ్గి పట్టాలు మారి ఒక స్టేషన్‌లోకొచ్చి ఆగింది. ఇందాకటి జంటలోని జవ్వని ప్లాటుఫారం మీదకు చూసి ఎందుకోగాని భయపడిపోయింది. ఆదుర్దాగా ఇటు తిరిగి -

"మోహన్, అటు చూడు" అని ప్లాట్‌ఫారంమీద ఎవర్నో చూపింది.

"ఏమిటి?" అని అతడు విసుక్కుంటూ అటు చూశాడు.

"అక్కడ... ఆ నీలం షర్టు వేసుకున్నతను... మా ఆయనే... నాకేదో భయంగా ఉంది మోహన్!" అని బిత్తరచూపులు చూస్తుంటే అతను అటు చూచి

"అవును. మీ ఆయనే. నీ కోసమే వెదుకుతున్నట్టుంది. మనముందు పెట్టెలోనేఎక్కుతున్నాడు. మనం ఇక్కడే దిగిపోదాం పద" అనంటూ తమ సామాన్లనందుకుని దిగిపోయారు. వీళ్ల నాటకాన్నంతా చూస్తున్న శంభూ "హే భగవాన్! ఇదొక దొడ్డిదారి వ్యవహారమా?" అని విస్తుపోయాడు.

వాళ్ళలా వెళ్లారో లేదో రైలు కూత వేస్తూ ముందుకు కదిలింది. ఎప్పుడెక్కాడో గాని టికెట్ కలెక్టరొచ్చి టికెట్ చెక్ చేస్తున్నాడు. చేస్తూ ఇందాకటి నవల చదువుకుంటున్న పెద్దమనిషి దగ్గరకొచ్చి "టికెట్ ప్లీజ్" అని అడిగితే ఆయన దర్జాగా మూడు టిక్కెట్లను తీసి ఆయనకందించి ఆ ముగ్గురూ ఎవరో కూడా చూపించాడు. టీ.సీ ఓ కుర్రాణ్ణి చూపి "ఈ అబ్బాయి టికేట్టేది?" అనడిగితే ఆయన నీళ్ళు నమిలాడు. టీ.సి. తన రసీదు బుక్కును తెరచి పెనాల్టీతో కలిపి రెండు వందలివ్వండి" అన్నాడు. దానికాపెద్ద మనిషి ఏదో నసిగాడు. టీ.సి. మరేదో అన్నాడు. అని ఆయనిచ్చిన వంద నోటుని జేబులో దోపుకుంటూ ముందుకు నడిచాడు. ఇదోరకమైన దోపిడీ అనుకున్నాడు శంభూ.

రైలు చక్రాలు ఇనుప పట్టాలకు రాచుకుని చేస్తున్న శబ్దంలో మార్పు. రైలు కృష్ణా నది వంతెన మీద వెళుతోందని అనుకున్నాడు శంభూ. తమ ఊరొచ్చేస్తోందన్నమాట. చిన్నప్పటినుంచీ తనకీనదీ, వంతెనా తెలుసు. స్నేహితులతో కలిసి తను వంతెన కింద ఆడుకున్నాడు. ఈ గెరెండాల మీదున్న పట్టాల మధ్య పందెంవేసుకుని పరుగెత్తాడు. ఈ వంతెన కిందున్న ఇసుకలో లక్ష్మితో కలసి ఆడుకున్నాడు. ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ తన వంతెన మీద వెళుతుంటే అతనికేదో చెప్పలేని అనందం!

మరో పది నిముషాల్లో రైలు తమ ఊరి స్టేషన్లోకొచ్చి ఆగింది. శంభూ తన సంచీ తీసుకుని ప్లాట్ ఫారం మీదకు దిగాడు. చుట్టూ చీకటి. స్టేషన్ మాస్టర్ గదిలో లైటు నీరసంగా వెలుగుతోంది. బయట రోడ్డు మీదకొచ్చి ఆకాశంవైపొకసారి చూశాడు. నల్లటి మబ్బులు దట్టంగా అలముకున్నాయి. ఈ చీకట్లో తను మూడు మైళ్ళు నడవాలి! తప్పేదేముందని ముందుకడుగు వేశాడు. రివ్వున గాలి వీస్తోంది. ఏక్షణాన్నయినా వర్షమొచ్చేలా ఉంది. ముందుకడుగు వేస్తుంటే గాలి వెనక్కి తోస్తోందతన్ని. ఇంతలో నల్లటి మబ్బుల మధ్య మెలికలు తిరుగుతూ ఓ మెరుపు మెరిసింది. ఫెళఫెళ మని ఓ ఉరుము ఉరిమింది.

శరీరంలోని శక్తి నంతా కూడదీసుకుని వేగాన్ని హెచ్చించాడు శంభూ. పరుగు లాంటి నడకతో ఊరి పొలిమేరలోకొచ్చాడు. వర్షపు చినుకొచ్చి టప్‌మని అతని తలమీద పడింది. దాన్నతడు తుడిచేసుకుంటూండగానే మరో రెండు చినుకులతని మీద పడ్డాయి. వర్షం మొదలయింది. పరుగెత్తుకెళ్ళి ఎదురుగా కనిపించిన మర్రి చెట్టుకింద తల దాచుకున్నాడు. ఆ చీకట్లో దాని ఊడలు దయ్యాల్లా కనిపిస్తున్నాయి. తనీ ఊడల్ని పట్టుకుని ఉయ్యాలలూగాడు. పైకి పాకి పైనున్న చెట్టు కొమ్మల్ని అందుకున్నాడు. లక్ష్మితో కలిసి ఈ చెట్టు కింద గోళీ కాయలాడాడు. ఇన్నేళ్లయినా ఈ చెట్టులో ఏ మార్పు లేదు. అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. రివ్వున వీచిన గాలికి ఆ చెట్టు కొమ్మలు కదిలి దానిమీదున్న వర్షపు చినుకులొచ్చి అతన్ని తడిపేశాయి. అతని ఆలోచన్లు ఆగిపోయాయి. ఆకాశంలో మరో మెరుపు మెలికలు తిరిగింది. ఓ ఉరుము ఉరిమింది. ఆ

వెలుగులో రోడ్డుకవతలివైపున్న గుడి కనిపించిందతనికి. అప్పుడు జ్ఞాపకమొచ్చిందతనికి ఇది హనుమంతుడి గుడి అని.

ఈ గుడి కటువైపో రెండుమైళ్ళు వెడితే కృష్ణానదొస్తుంది. ఆ నదిలో తను ఈదులాడేడు. లక్ష్మికి ఈదటం నేర్పాడు. ఆ నది ఒడ్డునున్న చింతచెట్టెక్కి దాని కాయల్ని కోసి వాటిని తింటూ, కబుర్లు చెప్పుకుంటూ తమ ఊరు చేరుకునేవారు లక్ష్మి, తనూనూ. దాంతో ఈ గుడిలో కెళ్ళి, ప్రదక్షిణం చేసి, అంతెత్తునున్న గంటను మోగించి, మొక్కి, చెంపలేసుకుని ఇద్దరూ చెయ్యీ చెయ్యీ కలుపుకుని తమ ఊరు చేరేవారు. వారిమధ్యలో లక్ష్మి తనను తోకలేని హనుమంతుడు అని వెక్కిరించి కిలకిలా నవ్వుతూ పరుగెత్తుకు పారిపొయ్యేది. తనూ పరుగెత్తేవాడామె వెంట. తమ ఈ అన్యోన్యం చూచే పెద్దయ్యాక తమిద్దరికీ పెళ్ళి చెయ్యాలనుకునే వారు వారి పెద్దలు.

ఇలా లక్ష్మి గురించే ఆలోచిస్తూ ఇహ ఈ వాన నిలువదనుకుని తడుస్తూనే బయలుదేరాడు శంభూ. చుట్టూ చీకటి. పైనుంచి వర్షం. కిందంతా బురద. అడుగుతీసి అడుగు వెయ్యటం కష్టంగా వుంది. అలాగే నడుస్తూ ఊళ్ళోకొచ్చాడు. ఇరువైపులా వున్న ఇళ్ళలోంచి గుడ్డిదీపాలు కనిపిస్తున్నాయి. ఓ పాడుబడిన ఇంట్లో తలదాచుకున్న కుక్కొకటి ఈ కొత్త మనిషిని చూచి మొరిగింది. దాన్నేమీ పట్టించుకోకుండా ముందుకు నడిచాడు శంభూ. అంత దూరంలో తమ ఇల్లు కనిపించింది. ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయి. ఇల్లంటే పాతకాలపు ఇల్లు. మట్టితో కట్టిన ఇల్లు. పెంకుటిల్లు. ఆ ఇంట్లో దీపం వెలుగుతోంది.

ఆ ఇంటిని చూస్తూనే "అమ్మా" అని పిలిచాడు. గట్టిగా మాటలు వినిపిస్తున్నాయే గాని ఎవరూ పలకలా! మరో అడుగువేసి "నాన్నా" అన్నాడు. అని మరింత ముందుకెళ్ళాడు. అంతే. అక్కడి దృశ్యం చూచి అతని మనస్సు చివుక్కుమంది. అమ్మానాన్నలిద్దరి చేతుల్లోనూ సారా సీసాలున్నాయి. అప్పటికే ఖాళీ అయిన సీసాలు వాళ్ళమధ్య పడున్నాయి. ఆశ్చర్యమేసింది శంభూకి. ఇదేమిటీ? అమ్మ చేతిలోనూ సారాసీసా ఉందేమిటీ? అంటే అమ్మకూడా తాగుతోందన్నమాట. నాన్న అరుస్తోంటే అమ్మ ఆయన్ని తిడుతోంది. తమ ముందు నిల్చున్న తనను చూచి "వచ్చావా నాయనా. రా. లోపలకు రా" అని అమ్మ అంటే నాన్నేదో నసిగాడు. అంతేగాని ఇన్నేళ్ళతర్వాత తనొచ్చాడన్న సంబరంగానీ, సంతోషంగానీ వాళ్ళలో కనిపించలేదతనికి. ఈ రెండు మాటలూ పొడిగా అని మళ్ళీ వాళ్ళు తమ కీచులాటల్లో మునిగిపొయ్యారు. అస్సలు తనొకడక్కడున్నాడన్న ధ్యాసే లేదు వాళ్ళకి. వాళ్ళనే చూస్తూ అక్కడే నిలబడిపొయ్యాడు శంభూ. చాలాసేపే నిల్చున్నాడక్కడ. వాళ్ళ మాటల్ని బట్టి తమ భూమిని అమ్మిన విషయంలో వాళ్ళు తగువులాడుకుంటున్నారని అర్థమయిందతనికి. అంటే ఆ వున్న ఒక్క భూమినీ అమ్మేశారన్నమాట! ఛీ. ఏం మనుషులు వీళ్ళు. తను కడుపు కట్టుకుని పంపిన డబ్బు చాలక ఇలా ఉన్న ఆ కాస్త భూమినీ అమ్మి తాగుడుకింద ఖర్చు చేస్తున్నారన్నమాట! ఇక వీళ్ళీ జన్మలో మారరు. అనుకొని మారు మాట్లాడకుండా వెనుదిరిగి బయటికొచ్చాడు. నడుస్తున్నాడేగాని అతని మనస్సులో మాత్రం తననెవరో దోచేస్తున్న భావన.



భార్య: భర్తతో, "మీరొక పుస్తకం అయ్యుంటే ఎప్పుడూ మిమ్మల్ని చదువుతూ ఉండేదాన్ని"!
భర్త: నువ్వో డైరీ వయ్యుంటే ప్రతి సంవత్సరం నిన్ను మార్చేస్తూ ఉండేవాణ్ణి!"
చల్లా

ఆ వర్షంలో తడుస్తూనే లక్ష్మి ఇంటికొచ్చాడు. చూస్తే తాళం వేసుందా ఇంటికి. మరిప్పుడేం చెయ్యాలి? ఏమీ తోచలేదతనికి. మళ్ళీ నడక ప్రారంభించాడు. ఊరి పొలిమేరకొచ్చాడు. అక్కడ మళ్ళీ హనుమంతుడి గుడి కనిపించేసరికి వర్షం తగ్గింతర్వాత ఇంటికి తిరిగి వెళ్ళిపోవచ్చు అనుకుని అందులో వెళ్ళి నిలుచున్నాడు. తడిసిన కర్చీఫుతో తల తుడుచుకున్నాడు. చొక్కా అంచుల్ని పిండుకున్నాడు. గుడిలోపలి వైపుకొకసారి చూచాడు. అక్కడంతా చీకటి. నిశ్శబ్దం. పూజా పునస్కారాల్లేని గుడి ఇలాగే ఉంటుందనుకొని వర్షపు చినుకుల్ని చూస్తూ నిలబడిపొయ్యాడు. కాని ఇంతలో లోపలెవరో మాట్లాడుతున్న శబ్దం! తన భ్రమేమో అనుకున్నాడు. మళ్ళీ అదే శబ్దం! కాదు. భ్రమేం కాదు. నిజంగానే లోపలెవరో ఉన్నారు. చెవులు రిక్కించి మళ్ళీ విన్నాడు. మాటలు వినిపిస్తున్నాయి.

"ఈ వానేమిటి ఎంతకీ ఆగదు? ఈ రాత్రంత మనమిక్కడే ఉండేలా ఉందే" అని ఒక మగ గొంతంటే-

ఆ నీకేం మగాడివి. నువ్వే అలా అంటే ఆడదాన్ని నేనేమనాలీ? ఇంతసేపూ ఎక్కడున్నావని మావాళ్ళడిగితే నేనేం జెప్పాలీ?" అని ఓ ఆడ గొంతు వినిపించింది.

ఇదేమిటీ? ఈ గొంతెక్కడో విన్నట్టుందే అనుకున్నాడు శంభూ. కాని ఇంతలో అది తన భ్రమేనని అనుకుంటూంటే మళ్ళీ-

"అంత నీ భయమే గాని నిన్నెవరూ ఏమీ అనరు. మొన్న మీ నాన్న మనిద్దరినీ చూచాడు గదా? ఏమైనా అన్నాడా?" అందా మొగ గొంతు.

"ఆఁ ముసలాళ్ళిద్దరూ బాగానే అరిచారు. ఇంటి పరువు తీశానన్నారు. వంశ గౌరవం మంట గలిపానన్నారు. రేప్పొద్దున్న నాకు కడుపొస్తే తలెత్తుకు తిరగలేమన్నారు. అదే జరిగితే ఇంట్లోంచి తరిమేస్తామన్నారు" ఇందాకటి ఆడ గొంతది.

"మరి నువ్వే మన్నావ్?"

"ఏమంటానూ? ఏమీ అనలా. మొన్న నువ్విచ్చిన రెండు వరుసల గొలును తీసి అమ్మ చేతిలో పెట్టా. దాంతో ఇద్దరి నోళ్ళూ మూతబడిపోయాయి. తిండికి గతిలేని మాలాంటి వాళ్ళకి తేరగా అంత సొమ్మొస్తుంటే చేదా? అయినా నేను రేపో మాపో చెప్పేస్తా మన పెళ్ళి సంగతి...."

అంతే. అంతతో వాళ్ళ సంభాషణ ఆగిపోయింది. కొన్ని క్షణాల తర్వాత వాళ్ళిద్దరూ బయటకొస్తూన్న శబ్దం. శంభూ చప్పున అక్కడే వున్న ఓ స్థంభం చాటున నక్కిపొయ్యాడు. ఆలయం బయట కొచ్చి మెట్లు దిగుతూన్న వాళ్ళ సంభాషణ అతనికి వినిపిస్తూనే వుంది. ఇంతలో ఆకాశానికడ్డంగా నల్లటి మేఘాల్ని చీలుస్తూ తెల్లటి మెరుపు మెరిసింది. ఫెడేల్మని ఆ దగ్గరే ఎక్కడో ఒక పిడుగు పడింది. అప్పుడు మెరిసిన ఆ మెరుపే అతని జీవిత గమనాన్ని ఓ మలుపు తిప్పింది. ఆ క్షణకాలంలో మెట్ల మీదున్న ఆ ఇద్దరూ కనిపించారతనికి. ఆశ్చర్యం. ఆ యువకుడి పక్కన నడుస్తోంది లక్ష్మి! అవును తన లక్ష్మే!!

ఫెళఫెళమని పడిన ఆ పిడుగొచ్చి తన మీదే పడినట్టనిపించింది శంభూకి. తన హృదయాన్నెవరో కసిగా పిండేసినంత బాధ. అంత చలిలోనూ చమట పట్టిందతనికి. అయినా వాళ్ళ సంభాషణ వింటూనే ఉన్నాడతను.

"అయితే మీ శంభూగాడేమయ్యాడూ? మొదట్నించీ మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటారనే అనుకునే వాళ్ళుగా అందరూ?" అని అతనంటే లక్ష్మి -

"ఏమో ఎవరికి తెలుసు? వాడా పట్నంలో ఏ ముండ దగ్గర చేరాడోయేమో? అయినా ఇప్పుడాపనికిరాని వాడి విషయమెందుకూ? ముందు మన పెళ్ళి గురించి ఆలోచించు" అంటోంది.

ఆ మాటలు విన్న శంభూకి తన శరీరంలోని శక్తినంతా ఎవరో సిరెంజీ పెట్టి లాగేసినంత నీరసమొచ్చింది. ఎర్రగా, బుర్రగా అందంగా అంతెత్తు కెదిగిన తన లక్ష్మి చదువు వంట బట్టి నాగరికంగా వుందిప్పుడు. వాడెవడితోనో చేతులు కలిపి, చిలిపిగా నవ్వుతూ, చురుగ్గా కదిలి తన గుండెల మీంచి నడిచి పోతూంటే చూచి శంభూ హృదయంలోంచి వెచ్చటి కన్నీళ్ళు కళ్ళలోకి తన్నుకొచ్చాయి. ఒక కళాకారుడు మట్టి బొమ్మనొకదాన్ని చేసి, అందంగా తీర్చిదిద్ది, తన కళా నైపుణ్యంతో దానికి ప్రాణం పోస్తే ఆ బొమ్మే వెనుదిరిగి అతన్ని వెక్కిరిస్తూ వెళ్ళిపోతూన్నంత బాధేసింది శంభూకి. ఇహ ఇంటికి తిరిగి పోవాలనిపించలేదతనికి.

ఆ ఊళ్ళోనే ఉండకూడదని నేరుగా స్టేషన్ చేరుకున్నాడు. ప్లాట్ ఫారం మీద నిల్చుని రైలు పట్టాల్ని చూస్తూంటే రైలొస్తున్నట్టు దూరాన్నించి దాని కూత సన్నగా వినిపించింది. తన వూరొచ్చేప్పుడు రైల్లో రకరకాల దోపిడీల్ని చూచాడు. మరిప్పుడీ వూర్లో తన జీవితంలోని సుఖాన్నే దోచేశారు తన వాళ్ళు. ఇన్ని రోజులూ తనకెవరో ఉన్నారన్న ఆశ ఇప్పుడు లేదు. ఈ విశాల ప్రపంచంలో తనిప్పుడో ఏకాకి! అంతేకాదు. ఇన్ని రోజులూ లేని అనంతమైన మూగ బాధక అతని అంతరాంతరాల్లో నిండిపోయిందిప్పుడు. ఈ బాధ ఇహ తన జీవితంలో ఒక భాగం!

బొంబాయి వెళ్ళే రైలు అంతదూరాన్నించి వెలుగులు చిమ్ముతూ స్టేషన్‌లోకి దూసుకొస్తోంది ....